
సాక్షి
గుంటూరు
గురువారం । 3 । ఆగస్టు । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ నుంచి నీరు వచ్చి చేరుతుండటంతో పులిచింతల ప్రాజెక్టు నిల్వ బుధవారం సాయంత్రానికి 34 టీఎంసీలకు చేరింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 3,422 క్యూసెక్కులు విడుదల చేశారు.



హుండీ ఆదాయం రూ.15లక్షలు

దుర్గి : అడిగొప్పల శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ. 15,43,027ల ఆదాయం వచ్చినట్లు ఈఓ. శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు.

న్యూస్‌రీల్

జేసీతో సమావేశమైన ట్రైనీ జూనియర్ న్యాయమూర్తులు



గుంటూరు : శిక్షణలో ఉన్న 11 మంది జూనియర్ సివిల్ న్యాయమూర్తులు బుధవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారిని కలిశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సమావేశమైన ట్రైనీ న్యాయమూర్తులు రెవెన్యూ, పౌరసరఫరాలు, స్పందన, జగనన్నకు చెబుదాం, రికార్డు రూమ్ నిర్వహణ, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల విధి నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. జేసీ పలు అంశాలపై వారితో చర్చించారు. మారుతున్న కాలంలో ప్రజల అవసరాల నిమిత్తం రెవెన్యూ శాఖలో వస్తున్న వేగవంతమైన మార్పులను వివరించారు. న్యాయమూర్తులు పలు సందేహాలను నివృత్తి చేశారు.

సజావుగా పింఛన్ల పంపిణీ




నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుకను గుంటూరు జిల్లాలో బుధవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు అందజేశారు. రెండో రోజు జిల్లాలో 92.70 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,49,667 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.68.59 కోట్లు కేటాయించింది. బుధవారం సాయంత్రానికి 2,31,430 మందికి నగదు అందజేశారు.

ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ముస్లిం, మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కల్పిస్తున్నట్లు గుంటూరు-1, 2 ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు షేక్ మహిమున్నీసా, షేక్ కరీముద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల మూడో వారంలో ప్రారంభం కానున్న డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ కోసం ఈనెల 17వ తేదీలోపు ఆసక్తి గల అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టెన్త్‌లో ఉత్తీర్ణులై, ఉర్దూ భాషలో చదవడం, రాయడం వచ్చిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గుంటూరు-1 పరిధిలో పాలాసుపత్రి వద్ద ఉన్న చిన్నబజారులోని అమీనా కాంప్లెక్స్‌లోని ఉర్దూ అకాడమీ శిక్షణ కేంద్రంలో నేరుగానూ, 85550 88516 సెల్ నంబర్లో సంప్రదించాలని తెలిపారు. అదే విధంగా గుంటూరు-2లో కృష్ణనగర్ రెండో లైనులోని శిక్షణ కేంద్రంలో 94940 42963 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

యార్డులో 36,473 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 33,985 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,473 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి రూ.24 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి రూ.26 వేల వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.24 వేల వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10 వేల నుంచి 25,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5 వేల నుంచి రూ.14 వేల వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,724 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

దుర్గగుడి ఆదాయం భళా

- 2022-23లో రికార్డు స్థాయిలో రూ.156.97 కోట్లు
- రూ.245 కోట్లు చేరిన దేవస్థాన మూలధనం
- ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీ
- కరోనా తర్వాత రెట్టింపయిన ఆదాయం



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది(ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన బెజవాడ కనకదుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. దర్శన రుసుం, హుండీ ఆదాయం గణనీయంగా పెరిగింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు రెట్టింపయ్యాయి. ఆలయ ఖర్చులను గణనీయంగా తగ్గించారు. దీంతో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి 2022-23వ సంవత్సరంలో రికార్డు స్థాయి ఆదాయం సమకూరింది. దేవస్థాన చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత ఆర్థిక సంవత్సరంలో రూ.156.97 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఇక దేవస్థాన మూల ధనం వివిధ బ్యాంక్‌లలో డిపాజిట్ల రూపంలో సుమారు రూ.245 కోట్ల మేర ఉన్నట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. కరోనా ముందు వరకు ఉన్న దేవస్థాన ఆదాయం కరోనా తర్వాత రెట్టింపయిందని తెలుస్తోంది. ఇదే సమయంలో భక్తుల సంఖ్య కూడా దాదాపు రెట్టింపయింది. వాస్తవానికి 2022-23వ సంవత్సరంలో దేవస్థానానికి మొత్తంగా రూ.262.11 కోట్ల మేర ఆదాయం సమకూరింది. అందులో ఆలయ ఖర్చుల నిమిత్తం రూ.105 కోట్ల వరకు వినియోగించారు. దేవదాయ శాఖకు వివిధ పద్దుల కింద రూ.33 కోట్లను దేవస్థానం జమ చేసింది. మొత్తంగా దేవస్థానానికి గతంలో ఎన్నడూ లేని విధంగా 2022-23 ఆర్థిక సంవత్సరం మంచి ఆదాయం సమకూరింది. ఆదాయం పెంపునకు దుర్గగుడి ఈఓ తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీ

రాష్ట్రంలోని అతి పెద్ద దేవాలయాల్లో రెండో స్థానంలో ఉన్న దుర్గగుడికి ఏటా భక్తుల రద్దీ పెరుగుతోంది. అమ్మవారి దర్శనానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్నాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. సాధారణ రోజుల్లో రోజూ వేలాది మంది వస్తున్నారు. ఇక శుక్ర, శని, ఆదివారాల్లో 70 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. దసరా, భవానీ దీక్షలు వంటి విశేష పర్వదినాల్లో వచ్చే భక్తుల సంఖ్య రోజుకు లక్షకు పైగానే ఉంటోంది. దీంతో అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు కొనుగోలు చేసిన టికెట్లు, ప్రసాదాలు, ఆర్జిత సేవల ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగింది.



2021-22లో నికర ఆదాయం రూ.86.80 కోట్లే

2021-22 ఆర్థిక సంవత్సరంలో దేవస్థానానికి రూ.86.80 కోట్ల నికర ఆదాయం సమకూరింది. ఆ ఏడాది దేవస్థానానికి రూ.259 కోట్ల ఆదాయం వచ్చినప్పటికీ, ఖర్చులు అన్నీ పోను రూ.86.80 కోట్ల ఆదాయమే మిగిలింది. హుండీల ద్వారా రూ.42.49 కోట్లు, ఈ-హుండీల ద్వారా రూ.2.79 కోట్లు, విదేశీ కరెన్సీ ద్వారా రూ.5.65 లక్షల ఆదాయం సమకూరింది. ఇక ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.22.48 కోట్లు, ఆది దంపతులకు నిర్వహించిన ఆర్జిత సేవల ద్వారా రూ.3.29 కోట్ల ఆదాయం లభించింది. ఇక దసరా పూజల్లో రూ.1.68 కోట్లు, దర్శన టికెట్ల విక్రయాల ద్వారా రూ.18.63 కోట్ల ఆదాయం, వడ్డీలు, ఇతర మార్గాల ద్వారా రూ.15.20 కోట్ల ఆదాయం లభించింది.

2022-23లో లభించిన ఆదాయం ఇలా...

హుండీల ద్వారా రూ.65.65 కోట్లు, ఈ-హుండీ ద్వారా రూ. 37.56 లక్షలు, ఇతర దేశాల కరెన్సీ ద్వారా రూ.25.93 లక్షలు, సత్రాల ద్వారా రూ.23.92 లక్షలు, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.32.57 కోట్లు, ఫొటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.11.13 లక్షలు, పూజా సామగ్రి ద్వారా రూ.46.75 లక్షలు, కల్యాణ సేవల ద్వారా రూ.13.99 లక్షలు, దసరా ఉత్సవాల పూజల ద్వారా రూ.2.32 కోట్లు, దర్శన టికెట్ల విక్రయాల ద్వారా రూ.35.92 కోట్లు, బస్సుల ద్వారా రూ.2.68 కోట్లు, బ్యాంకులలో డిపాజిట్లపై వడ్డీ రూ.15.23 కోట్లు, సేవింగ్ అకౌంట్ వడ్డీ రూ.21.55 లక్షలు, బంగారంపై వడ్డీ రూ.1.11 కోట్లు, పంట భూమి కౌలు ద్వారా రూ.25.03 లక్షలు, షాపులు లీజుల ద్వారా రూ.2.36 కోట్లు, భక్తుల తలనీలాల ద్వారా రూ.7.87 కోట్లు, కొబ్బరి చెక్కల ద్వారా రూ.90 లక్షలు, టోల్‌గేట్లు కాంట్రాక్టర్ ద్వారా రూ.1.89 కోట్లు, చీరల టెండర్ ద్వారా రూ.4.23 కోట్లు, చెప్పుల స్టాండ్ ద్వారా రూ.13.73 లక్షలు, సెల్‌ఫోన్లు కౌంటర్ ద్వారా రూ.50.16 లక్షలు, క్లోక్‌రూమ్ టెండర్ ద్వారా రూ.47.60 లక్షలు, స్పాట్ ఫొటో కౌంటర్ ద్వారా రూ.17.21 లక్షల ఆదాయం లభించింది.

20 రోజుల్లో దుర్గమ్మ హుండీ కానుకల ఆదాయం రూ.3.14 కోట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు హుండీ కానుకల ద్వారా రూ.3.14 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో సమర్పించారు. ఆది దంపతులకు భక్తులు సమర్పించిన కానుకలను మహామండపం ఆరో అంతస్తులో బుధవారం లెక్కించారు. 20 రోజులకు రూ.3,14,20,807 నగదు, 652 గ్రాముల బంగారం, 7.085 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈఓ భ్రమరాంబ తెలిపారు. సరాసరిన రోజుకు రూ.15.07 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. కానుకల లెక్కింపును దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు. ఈ-హుండీ ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రూ.90,762 విరాళాలను భక్తులు అమ్మవారికి సమర్పించారు. కానుకల లెక్కింపులో ఆలయ డీఈఓ గురుప్రసాద్, పాలక మండలి సభ్యులు చింకా శ్రీనివాసులు, కట్టా సత్తెయ్య, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి, అధికారులు జి.వి. కృష్ణారావు, ఎం.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

పింగళి సేవలు అసమానం

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



గుంటూరు : భారత జాతీయ జెండా రూపకర్త, స్వాతంత్య్ర సమరయోధుడు పింగళి వెంకయ్యను ఈ జాతి ఎప్పటికీ మరచిపోలేదని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి కొనియాడారు. పింగళి జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జేసీ మాట్లాడుతూ దేశ సమగ్రతను చాటిచెప్పే విధంగా జాతీయ జెండాను రూపొందించిన మహనీయుడన్నారు. దేశం కోసం కృషి చేసిన పింగళి సేవలను వెలకట్టలేమని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలి

గుంటూరు: జిల్లాలో పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 సంబంధించి నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం బీఎల్‌ఓలు డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో నూతన ఓటర్లను చేర్చడం, వెరిఫికేషన్, మార్పులు, చేర్పులు తదితర అంశాలను చూస్తారన్నారు. ఈ క్రమంలో వివిధ రాజకీయ పార్టీల పక్షాలవారిని, బీఎల్వోలను సమన్వయం చేసుకుంటూ బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొనేలా చేయాలని తెలిపారు. ఇక నుంచి ప్రతి బుధవారం ఓటర్ల నమోదు కార్యక్రమానికి సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. డీఆర్‌ఓ చంద్రశేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, పాల్గొన్నారు.

ఆశలను చిదిమిన మృత్యుశకటం

ప్రైవేటు కంపెనీ బస్సు ఢీకొని అక్కా తమ్ముళ్ల మృత్యువాత

- ఘటనాస్థలంలో అక్క.. ఆస్పత్రికి తరలిస్తుండగా తమ్ముడు మృతి
- ఓవర్ టేక్ చేస్తూ బస్సును బలంగా ఢీకొట్టడంతో ఘటన
- ఏఎన్‌ఎంగా ఎంపికై, శిక్షణకు సోదరుడి వాహనంపై వెళుతుండగా ఘటన



మృతురాలు మొక్కల గోవర్ధని



నల్లగొర్ల గోపి (ఫైల్)

తాడికొండ: ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేటు ఫ్యాక్టరీకి చెందిన ప్రయాణికులను తరలించే బస్సు ఢీకొట్టిన ఘటనలో అక్కా, తమ్ముళ్లు దుర్మరణం పాలైన ఘటన బుధవారం తాడికొండ మండలం లాం- అడ్డరోడ్డు మధ్య ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా జరిగింది. ఈ ప్రమాదంలో యువతి కాలు నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందగా, యువకుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. వివరాల ప్రకారం మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన నల్లజర్ల గోపి (20) తన పిన్ని కుమార్తె అయిన పెదకూరపాడు మండలం ఖమ్మంపాడు గ్రామానికి చెందిన మొక్కల గోవర్ధని(36)ని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని వెళుతుండగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద ఒక రవాణా వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేటు కంపెనీకి ఉద్యోగులను తరలించే బస్సును బలంగా ఢీకొట్టాడు. ఘటనలో ఇద్దరి కాళ్లకు బలమైన గాయాలు కావడంతో పాటు, ఎముకలు విరిగి పక్కన ఎగిరిపడేంత స్థాయిలో ప్రమాదం జరిగింది. గోవర్ధని ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా.. గోపి 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు.

ఇటీవలే శుభవార్త.. అంతలోనే కానరాని లోకాలకు..

మృతురాలు మొక్కల గోవర్ధని ఇటీవలే ఏఎన్‌ఎంగా సెలక్ట్ అవగా.. శిక్షణ నిమిత్తం జీజీహెచ్‌కు వెళుతుంది. ఈమెకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెదకూరపాడులో ఆశా కార్యకర్తగా పనిచేస్తూ ఏఎన్‌ఎంగా సెలెక్ట్ అయి గత రెండు రోజులుగా శిక్షణకు వెళుతుంది. భర్త శివకృష్ణ వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు.. ఏఎన్ఎంగా ఎంపికవడంతో తమ కుటుంబానికి ఆసరా లభించిందనుకుంటున్న సమయంలో జరిగిన ప్రమాదం కుటుంబలో విషాదం నింపిందని బంధువులు కంటతడి పెట్టారు. మృతుడు నల్లగొర్ల గోపి ఓ ప్రైవేటు కంపెనీలో వర్కర్‌గా పనిచేస్తుండగా చేతికందిన కొడుకు దుర్మరణం పాలవడం తల్లిదండ్రులకు గుండెకోతను మిగిల్చింది.

శరవేగంగా గుంటూరు - నంద్యాల డబ్లింగ్ పనులు



శావల్యాపురం రైల్వేస్టేషన్‌ను సందర్శించిన రైల్వే అధికారులు

శావల్యాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సారధ్యంలో గుంటూరు-నంద్యాల వరకు నిర్వహిస్తున్న రైల్వే డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు సికింద్రాబాద్ రైల్వే సంరక్షణ భద్రతా అధికారి (సీఆర్ఎస్) ప్రంజీవ్ సక్సేనా అన్నారు. బుధవారం శావల్యాపురం రైల్వేస్టేషను సందర్శించారు. అనంతరం చీకటిఈగలపాలెం రైల్వే స్టేషనులో 16 కిలోమీటర్ల రైల్వే డబ్లింగ్ పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా రైల్వే భద్రతా అధికారి సక్సేనా మాట్లాడుతూ గుంటూరు నుంచి నంద్యాల వరకు 257 కిలోమీటర్ల ఉండగా ఇప్పటివరకు 160 కి.మీ. వరకు డబ్లింగ్ రైల్వే ట్రాక్ పనులు పూర్తి అయ్యాయన్నారు. ఈఏడాది రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా ఫిబ్రవరి 28న శావల్యాపురం రైల్వే స్టేషను నుంచి మునమాక రైల్వేస్టేషను వరకు 20 కిలోమీటర్ల వరకు పనులు ప్రారంభించామన్నారు. గతనెల 5వ తేదీన తర్లుపాడు, కంభం, జంగభట్ల కృష్ణాపురం, 22 కిలోమీటర్ల వరకు డబ్లింగ్ పనులు ప్రారంభించామన్నారు. నరసరావుపేట రూరల్ పరిధిలో మునపాక నుంచి సాతులూరు వరకు 22 కిలోమీటర్ల వరకు సెప్టెంబరు నెలలో పూర్తి చేస్తామన్నారు. గిద్దలూరు, దిగువమెట్ట, 38 కిలోమీటర్ల పనులు జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. నడికూడి - శ్రీకాళహస్తి రైల్వే పనులు శావల్యాపురం రైల్వేస్టేషను వరకు పూర్తి అయ్యాయని మార్చి 2024 నాటికి దర్శి వరకు రైల్వేపనులు పూర్తి అవుతాయన్నారు. గుంటూరు నుంచి తిరుపతి వెళ్లే రైలు శావల్యాపురం రైల్వే స్టేషనులో నిలుపుదల చేయాలని ప్రజలు కోరగా త్వరలో సమస్య పరిష్కారిస్తామన్నారు. శావల్యాపురం 268 సమీపాన గేటు వద్ద ఆర్‌యూబీ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ అనుమతులు మంజూరు అయ్యాయని త్వరలో టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని, గుంటూరు డీఆర్‌ఎం మంగళగిరి రామకృష్ణ తెలిపారు. అనంతరం రైల్వే ట్రాలీ ద్వారా చీకటిఈగలపాలెం నుంచి శావల్యాపురం రైల్వేస్టేషన్ వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. వారితో సీపీఓ నీరజ్ ఆగర్వాల్, కుందు రామారావు, రామరాజు, సీఐ తిరుపతిరావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.


భారీగా ఎరువులు స్వాధీనం

125.6 మెట్రిక్ టన్నులు.. రూ.1.25 కోట్ల విలువ !



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు ఏటుకూరు రోడ్‌లోని వెంగమాంబ ఎస్టేట్‌లో గల శ్రీ బాలాజీ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ ఎరువుల గోడౌన్‌లో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో అనుమతి లేని రూ.1.25 కోట్ల విలువ గల 125.6 మెట్రిక్ టన్నుల సూక్ష్మ పోషక ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గోడౌన్ మేనేజర్ కుశాల్ తివారి హైదరాబాదు నుంచి అనుమతి లేని ఎరువులను 25 కిలోల బస్తాలు తెప్పించి వాటిని రకరకాల పేర్లతో 1 కిలో ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారని తెలిపారు. టింకో కెమికల్స్ మహారాష్ట్ర పేరుతో తయారవుతున్నట్లుగా కాల్షియం నైట్రేట్, ఎంఏపీ, పొటాషియం సల్ఫేట్, 19-19-19 తదితర ఎరువులు తయారు చేసి డీలర్లకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందని వివరించారు. ఈ ఎరువులను స్వాధీనం చేసుకుని గోడౌన్ మేనేజర్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. అనుమతి లేకుండా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు నిల్వ చేసి, విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గుంటూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు తోటకూర శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న అన్ని రకాల ఎరువులను శాంపిల్స్ తీసి నాణ్యతా పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపడం జరుగుతుందని తెలిపారు. తనిఖీల్లో గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారులు బి.అంజిరెడ్డి, బి.కిషోర్, కొల్లిపర ఏఓ కె.వెంకట్రావు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 514.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. కుడి కాలువకు నీటిని నిలుపుదల చేశారు. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 853.80 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 77,359, రోజా నుంచి 886 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

ప్రైవేటు ఏజెన్సీ కాంట్రాక్ట్ రద్దు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు పారిశుధ్య కార్మికులు ఉన్నా కార్యాలయాన్ని శుభ్రం ఉంచేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఆరుగురు కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించారు. వీరంతా మూడు నెలలుగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే, ఈ కాంట్రాక్ట్ సిబ్బంది సక్రమంగా పని చేయడం లేదు. సకాలంలో రూముల్ని శుభ్రం చేయకపోవడంతో కార్యాలయ సిబ్బంది కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. కొద్దిరోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు నగరపాలక సంస్థ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరింది. కాంట్రాక్ట్ సిబ్బంది సకాలంలో రాకపోవడంతో, తిరిగి నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులతో కార్యాలయాన్ని శుభ్రం చేయించారు. దీనిపై గత నెల 7న అయినవారు ఉండగా..బయట వారు దండగ! అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. కాంట్రాక్ట్ సిబ్బంది పని నిర్వహణకు సంబంధించి మూడు నెలల కాలం పూర్తవ్వడంతో ఇంజినీరింగ్ అధికారులు దాన్ని రెన్యువల్ చేసే విషయాన్ని కమిషనర్ కీర్తి చేకూరి దృష్టికి తీసుకుకొచ్చారు. సదరు కాంట్రాక్ట్ రద్దు చేయాలని, గతంలో నిర్వహించిన విధంగానే శానిటేషన్ వర్కర్లతో కార్యాలయాన్ని శుభ్రం చేయించాలని ఆదేశించినట్లు సమాచారం. దీనిపై కార్యాలయ మేనేజర్ శివన్నారాయణను వివరణ కోరగా కమిషనర్ ఆదేశాల మేరకు ఆగస్టు 1నుంచి కాంట్రాక్ట్ సిబ్బంది విధులకు హాజరుకావడం లేదని, నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికుల ద్వారానే కార్యాలయాన్ని శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు.

మూడు నెలలకు రూ. 5.30 లక్షలు

నగరపాలక సంస్థ కార్యాలయాన్ని శుభ్రం చేసేందుకు విజయవాడకు చెందిన ఓ ప్రయివేట్ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. మూడు నెలల కాలానికి రూ.5.30లక్షల్ని జనరల్ ఫండ్స్ నుంచి నిధులు కేటాయించారు. అయితే ఈ కాంట్రాక్ట్ సిబ్బంది నెల రోజుల్లో ఎప్పుడు, ఎక్కడ విధులు నిర్వహించారో ఎవరికీ తెలియదని కార్యాలయ సిబ్బంది చెప్పడం గమనార్హం.

సమర్థంగా విధులు నిర్వహించాలి

జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్



జూమ్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్

నగరంపాలెం: జిల్లాలో నమోదైన కేసులలో దోషులకు శిక్షలు పడేలా ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లతో ఎస్పీ జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై, పలు కోర్టులలో కొనసాగుతున్న కేసుల పూర్వాపరాలు, ప్రస్తుత కేసుల పరిస్థితులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్, ప్రత్యేక గ్రేవ్, ఇతరత్రా కేసుల్లో విచారణాధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు హాజరై, దోషులకు కోర్టులలో శిక్షలు పడే విధంగా వ్యవహరించాలని అన్నారు. జిల్లాలోని వివిధ కోర్టులలో విచారణ జరిగే కేసుల్లో కాలయాపనకు అవకాశం లేకుండా వీలైనంత త్వరగా కేసుల విచారణ పూర్తి చేయాలని సూచించారు. ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీలు శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ), కె.సుభాష్ (ఎస్‌బీ) సీఐలు బి.నరసింహారావు, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం

నగరంపాలెం: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ బుధవారం గెజిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

పెదకూరపాడు : డెప్యూటీ కలెక్టర్ జిల్లా విజిలెన్స్ సెల్-2
తాడికొండ (ఎస్సీ): స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కోనేరు రంగారావు కమిటీ
మంగళగిరి : స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్
పొన్నూరు: ప్రాజెక్టు డైరెక్టర్ డీఆర్‌డీఏ గుంటూరు
వేమూరు (ఎస్సీ): చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జిల్లాపరిషత్ గుంటూరు.
రేపల్లె: ఆర్డీఓ రేపల్లె
తెనాలి : సబ్ కలెక్టర్ తెనాలి **బాపట్ల** : ఆర్డీఓ, బాపట్ల
ప్రత్తిపాడు (ఎస్సీ): ఆర్డీఓ గుంటూరు, **గుంటూరు పశ్చిమ** : అదనపు కమిషనర్ జీఎంసీ
గుంటూరు తూర్పు: కమిషనర్ జీఎంసీ
చిలకలూరిపేట: స్పెషల్ కలెక్టర్ పులిచింతల
నరసరావుపేట: ఆర్డీఓ నరసరావుపేట **సత్తెనపల్లి** : ఆర్డీఓ సత్తెనపల్లి
వినుకొండ : స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ (పులిచింతల)
మాచర్ల : స్పెషల్ కలెక్టర్ (పులిచింతల)
గురజాల : ఆర్డీఓ, గురజాల



తాడికొండ: అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్డు సెంట్రల్ లైటింగ్‌పై రూ.2.80 కోట్ల వ్యయంతో 11 కిలోమీటర్లు మేర పనులను ఏడీసీఎల్ సంస్థ శ్రీనివాస ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ పనులు మొత్తం పూర్తిచేసి 15 రోజుల క్రితమే రెండుసార్లు సీడ్ యాక్సిస్ రోడ్డుపై వెలుగులు విరజిమ్ముతూ ట్రయల్ రన్‌ను కూడా వేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. అయితే కోర్టు ఆదేశాలు పాటిస్తూ పనులు పూర్తిచేసిన అధికారులు దీనికి హైకోర్టు చీఫ్ జస్టిస్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలలో భాగంగా తేదీ కోసం ఎదురు చూస్తున్నారు. సీజే ఎప్పుడు ప్రారంభానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తే అప్పుడు ప్రారంభం చేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని అధికారులు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరు

ఆర్.సి.నెం. 742/2023 — **టెండరు నోటీసు** — తేది. 02-08-2023

వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరు వారి మార్కెట్ యార్డు, గుంటూరు నందు కార్యాలయ అవసరార్థము రిజిష్టర్లు మరియు పుస్తకములు ప్రింటింగ్ చేసి సరఫరా చేయుట, రెండు సంవత్సరముల కాలమునకు షోడా [illegible] నిర్వహణ మరియు యార్డు కార్యాలయము నందు ఒక సంవత్సర కాలమునకు [illegible] నిర్వహణ నిమిత్తము టెండర్లు పిలువబడుచున్నవి.
టెండరు షెడ్యూలు ఇచ్చుతేదీ: దీ.09-08-2023 నుండి దీ.09-08-2023 సాయంత్రము గం॥ 5.00 వరకు
టెండరు దాఖలు తేది : 11-08-2023 ఉదయము గం॥ 10.30 నుండి మధ్యాహ్నము గం॥ 1.00 వరకు
టెండరు తెరచు తేది: దీ. 11-08-2023 మధ్యాహ్నము గం॥ 4.00లకు
ఇతర వివరములకు మరియు టెండరు షెడ్యూళ్ళకు కార్యాలయపు పనివేళలలో సంప్రదించవలెను.

సం/- అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరు. — సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరు.

వినుకొండ పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం.144/2023/ఎ2 — తేది : 27-07-2023

కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్-బహిరంగ వేలం ప్రకటన (రెండవ పిలుపు)

వినుకొండ పురపాలక సంఘ పరిధిలోని నరసరావుపేట రోడ్డు [illegible] మునిసిపల్ ఖాళీ స్థలము సర్వే నెం.399/1ఎ, 400, 401/1 నందు వినుకొండ మునిసిపల్ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ 240 షాపులను [illegible] ... కౌన్సిల్ వారు తీర్మానం నెం.327, తేది.04.08.2023 ద్వారా ఆమోదించియున్నారు. ... తేది.10.08.2023 గురువారం ఉదయం గం॥ 11.00 ని॥ ల నుండి ... నిర్వహించబడును. ... కార్యాలయ పనివేళలలో ఉ.గం.10.00 నుండి సా.గం.5.00లోపు సంప్రదించగలరు.

సం/-పి.వెంకయ్య, కమీషనరు, వినుకొండ పురపాలక సంఘం

NARASARAOPET MUNICIPALITY, NARASARAOPET

'e'-PROCUREMENT - TENDER NOTICE

Tender Notice 627/2023/E1, — Dt.02-08-2023

1	Total No of Works	1 No of work (Nit.No.34A / 2023-24 Short Tender 1st call.	2 No's. of works 35A/2023-24 and 36A/2023-24-1st Call.
2	Total Estimate Value of Works	Rs.4,99,000/-	Rs.16,00,000/-
3	Bid document download starting date	03-08-2023 11:00 AM	03-08-2023 11:00 AM
4	Bid document download end date	07-08-2023 04:00 PM	17-08-2023 04:00 PM
5	Last Date & Time for receipt of Bids	07-08-2023 05:00 PM	17-08-2023 05:00 PM
6	(Nit.No.34A/2023-24 to 36A/2023-24 (Municipal General Funds)		

Note: Any addendum /corrigendum/bid clarifications/ time extension shall be issued on the website only. No separate press notification shall be issued. Further details can be seen @ e-Procurement market place at www.tender.apeprocurement.gov.in

Sd/- **Commissioner,**
Narasaraopet Municipality, Narasaraopet.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ మనోరంజని

గుంటూరు రూరల్: డాక్టర్ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం బాలింతలు, గర్భిణులకు ఎంతో మేలు అని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మనోరంజని తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా డాక్టర్ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ బుధవారం నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, సామాజిక విజ్ఞాన కళాశాల, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీడీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు తల్లి పాలు ఎంతో ముఖ్యమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరూ చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలని పౌష్టికాహారం అందజేస్తున్నారని చెప్పారు. మొదటి ఆరు నెలల్లో తల్లిపాలలో శిశువుకు తగిన పోషకాలు, ముఖ్యమైన యాంటీబాడీస్, బరువు ఎదుగుదల, వ్యాధినిరోధక శక్తి, తెలివితేటలు పెరుగుతాయన్నారు. తల్లి పాలు ఇవ్వటం ద్వారా సుమారు 500 కేలరీలు ప్రతి రోజు కరిగించవచ్చని తెలిపారు. మహిళా ఉద్యోగులు తమ పిల్లలకు పాలు ఇచ్చేందుకు కార్యాలయాల్లో ఒక గదిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ బిల్కిన్, ఎంపీటీసీ భూలక్ష్మి, సర్పంచులు ఎం.శిరీష, డి.సామ్రాజ్యం, ఎంపీడీఓ శోభారాణి, మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ కిట్లు అందజేశారు.


పౌష్టికాహారం కిట్లు అందుకున్న బాలింతలు, గర్భిణులతో ఐసీడీఎస్ పీడీ డాక్టర్ మనోరంజనీ తదితరులు

పెదపలకలూరు గ్రామంలో...

డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో బాలింతలు, తల్లులు, గర్భిణులకు పోషకాహారం కిట్‌లను 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి తెలిపారు. బుధవారం అందజేశారు.

మామిళ్లపల్లిలో రాజశ్యామల యాగం


యాగంలో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తదితరులు

చేబ్రోలు: పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో మూడురోజుల రాజశ్యామల యాగం బుధవారం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పక్ష ప్రభుత్వం విజయవంతంగా కొనసాగాలని, సమాజం యావత్తు సంక్షేమ ఫలాలను అందుకుని సుభిక్షంగా ఉండాలన్న ఆకాంక్షతో రాజశ్యామల యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలుత గ్రామ దేవత పెద్దేటయ్మ పీఠం వద్ద పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే యాగంలో మొదటి రోజు గణపతి హోమంతో క్రతువు ప్రారంభమైంది. వేద పండితులు కలశ స్థాపన, గణపతి, నవగ్రహ హోమం నిర్వహించారు. బజరంగ్ ఫౌండేషన్ జగన్నామ సంక్షేమ సంవత్సర కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నుంచి వచ్చిన వేదపండితులు మంత్రోచ్చరణతో నిర్వహించిన రాజశ్యామల యాగానికి వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ భక్తి శ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరు దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో మృతి చెందిన పవన్ కుమార్

మేదరమెట్ల: మోటారు బైకును కారు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన ఘటన పి.గుడిపాడు జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. జె.పంగులూరు మండలంలోని బూదవాడ గ్రామానికి చెందిన మొద్దుమాల పవన్‌కుమార్(22), గోగులమూడి కిషోర్, ఇస్తర్ల తేజ కొరిశపాడులో శుభ కార్యక్రమానికి హాజరై మోటారు బైకుపై తిరిగి వెళ్తున్నారు. ఇదే సమయంలో బైకు పి.గుడిపాడు జాతీయరహదారి గాజు ఫ్యాక్టరీ సమీపానికి రాగానే వెనుక నుంచి వచ్చిన కారు, మోటారు బైకును బలంగా ఢీ కొంది. ఈప్రమాదంలో బైకుపై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడిపోయారు. దీంతో పవన్(22) అక్కడికక్కడే మృతి చెందాడు. తేజ, కిషోర్‌లకు గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మోటారు బైకును ఢీ కొట్టిన కారు ఆగకుండా అక్కడనుంచి వెళ్లిపోయిందని స్థానికులు చెబుతున్నారు. మేదరమెట్ల ఎస్ఐ నాగశివారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అయితే ప్రమాదానికి కారణమైన కారును ముప్పవరం సమీపంలో వదిలి వెళ్లగా పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్మీ ర్యాలీ అభ్యర్థుల వసతి ఏర్పాట్లు పరిశీలన

నరసరావుపేట ఈస్ట్: ఆర్మీ ఎంపికల ర్యాలీ ఏర్పాట్లను జిల్లా జాయింట్ శ్యామ్‌ప్రసాద్ బుధవారం పరిశీలించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట డీఎస్ఏ స్టేడియంలో 20 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ర్యాలీకి హాజరయ్యే అభ్యర్థులు ఉండేందుకు అనువైన ప్రాంతాలను ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ అనిల్‌కుమార్‌లతో కలసి పరిశీలించారు. దీనిలో భాగంగా శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల బాలుర వసతి గృహాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్మీ ర్యాలీకి వేల సంఖ్యలో హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

- 94 కిలోలు, రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఒడిశా నుంచి కేరళకు తరలిస్తున్నట్లు గుర్తింపు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జె.రాంబాబు

పెదకాకాని: గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు మంగళగిరి డీఎస్పీ జె.రాంబాబు తెలిపారు. స్థానిక స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేరళ రాష్ట్రానికి చెందిన షైజు మచ్చింగల్ వర్గీస్, మండకర సడకతుల్లాలు స్నేహితులు. చెడు అలవాట్లకు బానిసలుగా మారి, సులువుగా డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో ఒడిశా వెళ్లి అక్కడ నుంచి 94 కేజీల గంజాయిని తీసుకుని కారులో వెళ్తున్నారు. సోమవారం గుంటూరు ఆటోనగర్ సమీపంలోకి చేరుకునే సరికి మరమ్మతులకు గురైంది. కారును రిపేరు చేయించేందుకు ఆటోనగర్ ఫేస్- 4 లోని బొల్లం వెంకటేశ్వరరావుకు చెందిన రామచంద్ర కారు షెడ్డులో పెట్టారు.
కారులో ఉన్న గంజాయిని మరో కారులో తరలించేందుకు మంగళవారం కారుతో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ముందస్తు సమాచారం మేరకు అప్రమత్తమైన పెదకాకాని సీఐ బండారు సురేష్ బాబు సిబ్బంది రాబడిన సమాచారం మేరకు కారును అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా సుమారు 94 కేజీల గంజాయి గుర్తించారు. నిందితులు కేరళ రాష్ట్రానికి చెందిన షైజు మచ్చింగల్ వర్గీస్, మండకర సడకతుల్లాలను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి గంజాయి తో పాటు ఆడి కారు, స్విఫ్ట్ డిజైర్ కారు, 4 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని డీఎస్పీ వివరించారు. నిందితులు ఇద్దరూ కూడా గతంలో వేర్వేరు గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఈ కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు. పెదకాకాని తహసీల్దార్ పి.రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సీఐ బండారు సురేష్‌బాబు, ఎస్ఐ వి.రాంబాబు ఉన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

తండ్రీకొడుకులకు గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారి మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో తండ్రీకొడుకులు గాయాలపాలైన ఘటన బుధవారం గణపవరం వద్ద చోటు చేసుకుంది. నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపిన వివరాలు.. గణపవరానికి చెందిన షేక్ మస్తాన్‌వలి, చిలకలూరిపేటలోని మద్దినగర్‌లో నివాసం ఉంటూ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. వృద్ధాప్య పెన్షన్ కోసం తన తండ్రి షేక్ మౌలాలిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని గణపవరం వెళ్లి తిరిగి చిలకలూరిపేట వస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిని దాటి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న తండ్రీకొడుకులు గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మస్తాన్‌వలి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


తీవ్రంగా గాయపడిన షేక్ మౌలాలి


గాయాలపాలైన షేక్ మస్తాన్‌వలి

మందుబాబుల అడ్డాగా బస్టాండ్ ప్రాంగణం

పట్టించుకోని అధికారులు

నరసరావుపేట టౌన్: ఒక వైపు వందల సంఖ్యలో ప్రయాణికులు తిరుగుతుంటే.. మరో వైపు మద్యం మత్తులో కొందరు తూలుతుంటారు. ఒక వైపు పక్కనే నమాజ్ ప్రార్థనలు వినిపిస్తుంటే.. మరో వైపు మత్తెక్కిన మందు బాబులు కేకలేస్తుంటారు. ఒక వైపు ప్రయాణికులు వారి నుంచి భయభ్రాంతులకు గురవుతుంటే.. మరో వైపు మందు బాబులు చిల్లర వేషాలతో వెకిలిగా నవ్వుతుంటారు. పల్నాడు జిల్లా ప్రధాన కేంద్రమైన నరసరావుపేట ఆర్టీసీ ప్రాంగణంలో పరిస్థితి ఇది. కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉన్న ప్రాంగణంలో తాత్కాలిక బస్టాండ్‌ను ఏర్పాటు చేసి అక్కడ నుంచి ప్రయాణికులను తరలిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆ స్థలం మందుబాబులకు అడ్డాగా మారింది. సాయంత్రం అయితే మందుబాబులు అక్కడకు గుంపులుగుంపులుగా చేరి బహిరంగంగా మద్యం తాగుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ మద్యం షాపు ఉండడంతో మందు బాబులకు ఈ ప్రాంతం రిలాక్స్ ప్రాంతంగా మారింది.


ఆర్టీసీ ప్రాంగణంలో మద్యం తాగుతున్న దృశ్యం

అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వటం నిలిపివేయాలి

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వటాన్ని వెంటనే నిలిపివేయాలని దళిత ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దళితుల మీద దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్), వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర దళిత రక్షణ యాత్రలో ప్రభుత్వం ముందు ఉంచాల్సిన డిమాండ్లపై బుధవారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో దళిత ప్రజాసంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు చింతపల్లి నాగమల్లేశ్వరరావు, కారుచోల రోశయ్య, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ప్రసాద్, జై భీమ్ భారత్ పార్టీ జిల్లా సమన్వయకర్త గోదా జాన్‌పాల్, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిగం చిట్టిబాబు, మాల మహానాడు జిల్లా నాయకులు కూచిపూడి చంద్రశేఖర్, ఎంఐఎం నాయకులు కరిముల్లా, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి తాళ్లూరు పెద్దిరాజు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు జి రవి బాబు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పులుల సంచారంపై పుకార్లు!

- పులులు చూశామంటున్న మహిళలు
- అవి జంతువులంటున్న అటవీశాఖాధికారులు

మాచర్ల: పట్టణ శివారు ప్రాంతంలోని 9వ వార్డు లోని ఎరుకల కాలనీ చివరి ప్రాంతంలో రెండు పులులు సంచరిస్తున్నట్లు ఆ ప్రాంత వాసులు ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో శివారు ప్రాంతంలో నివాస ముంటున్న మహిళ డి.రాజేశ్వరి బయట కూర్చున్న సమయంలో రెండు జంతువులు వేగంగా దూకుతూ సంచరించటంతో భయపడిన ఆ మహిళ వెంటనే ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకొని బంధువులకు సమాచారం ఇచ్చారు. ఆ తరువాత 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అ టవీ శాఖ అధికారులు జంతువుల అడగు జాడలను పరిశీలించారు. ఇవి అడవి కుక్కలని, భయపడాల్సిన అవసరం లేదని తేల్చారు. దీంతో శివారులో నివాసముంటున్న ఇద్దరు మహిళలు బుధవారం ఇళ్లు ఖాళీ చేశారు. కౌన్సిలర్ జగన్నాథం శివయ్య మాట్లాడుతూ వెల్దుర్తి మండలంలోని మండాది అడవుల నుంచి శివారులోని అటవీ ప్రాంతంలో పులు లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అటవీ శాఖ అధికారులు దృష్టి సారించాలని విన్నవించారు.

సామూహిక ఉత్సవాలు చేద్దాం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలో సామూహిక ఉత్సవాలను నిర్వహించాలని గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం శైవక్షేత్రాధిపతి శివస్వామి అన్నారు. శ్రీ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి ప్రాంగణంలో సామూహిక ఉత్సవాల పోస్టర్‌ను శివస్వామి బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతకు మారు పేరే గణేష్ ఉత్సవాలన్నారు. దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా బాలగంగాధర్ తిలక్ ప్రారంభించిన గణేష్ ఉత్సవాలు లక్షలాది మందికి జీవనోపాధిస్తున్నాయన్నారు. అలాగే హిందువులందరూ ఐక్యంగా ఉండడానికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి సభ్యులు నాగలింగం శివాజీ, జింక చక్రధర్, పొట్టి శ్రీహరి, బుల్లబ్బాయి ఏ శేషుబాబు పాల్గొన్నారు.

రెవెన్యూ లక్ష్యాన్ని సాధించాం

పట్నంబజారు: తనిఖీ రెవెన్యూ విభాగంలో గుంటూరు జిల్లా రవాణా శాఖకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని జూలైలో సాధించామని డీటీసీ షేక్ కరీమ్ బుధవారం తెలిపారు. తనిఖీ రెవెన్యూ లక్ష్యానికి సంబంధించి రూ. 1.17 కోట్లకు గాను రూ. 1.53 కోట్లు వసూలు చేసి 131 శాతంతో జూలై లక్ష్యాన్ని సాధించినట్లు వెల్లడించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది జూలై మాసంలో 30 శాతం వృద్ధి రేటు పెరిగినట్లు చెప్పారు. మొత్తం 1524 వాహనాలపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో వ్యక్తి మృతదేహం

కారంచేడు: ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని మరో వాహనంపై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. వాడరేవు- పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు- చీరాల మార్గంలో ఉన్న రెండు వంతెనల మధ్యలో ఈ ప్రమాదం బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మృతి చెందిన యువకుడు చీరాల వైపు నుంచి కారంచేడు వైపునకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. వాహనం వెనుక నుంచి ఢీకొట్టిందా లేక ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టిందా అనే విషయం తెలియాల్సి ఉంది. మృతి చెందిన యువకుని వయసు 30-35 సంవత్సరాల మధ్య ఉంటుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ ఓపెన్ 10th, ఇంటర్ మరియు BA, B.Com, B.Sc, M.A, M.Com, M.Sc, MBA, MCA, ITI లకు పాస్ గ్యారంటీ శిక్షణ ఇవ్వబడును. సంప్ర॥ శ్రీ దివ్య ఇన్‌స్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. 7396755801

REAL ESTATE

■ గుంటూరు జిల్లాలోని శ్రీ భ్రమరాంబపురం కాలనీ &మల్లికార్జునపురం కాలనీ & UDA అప్రూవ్ ప్లాట్స్ & జనచైతన్య వెంచర్‌లో ఉన్న ప్లాట్స్ అ/కొ. నం: 9848986831 మన్నెం లతీఫ్‌గౌడ్.

FLAT FOR SALE

■ గుంటూరు సంగడిగుంట కమ్మసేవ్యు గ్రౌండ్ దగ్గర స్వాతి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ నందు 2BHK ప్లాటు1400Sft.కారుపార్కింగ్ ఫుల్‌ఫినిష్‌తో అమ్మకమునకు కలదు 9550672222,9440016464

PLOT FOR SALE

■ ఉడా అప్రూవల్ ప్లాట్, రాజీవ్ టౌన్‌షిప్‌లో ప్లాట్ నెం-452. పడమర ఫేసింగ్, 250 చదరపు గజాలు 40 అడుగుల రోడ్డు, గేటెడ్ కమ్యూనిటీకి దగ్గరలో చ.గ. రేటు రూ. 19000/- 9849719999

■ గుంటూరు పలకలూరు రోడ్డు నందు 650 చ॥గ॥ స్థలం అమ్మకమునకు కలదు. చ॥గ॥ 57000/-లు మాత్రమే. సంప్రదించగలరు. 9440837515

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 9912105656

■ బంగారం బ్యాంకులలో/ప ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో/ప ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

■ బంగారం బ్యాంకులలో/ప ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999

■ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). సంప్ర ✆ 81818 97978

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) సంప్ర: ✆ 945 945 3338

WANTED

■ గుంటూరు బ్రాడీపేటలో నూతన బ్రహ్మణ హోటల్ నందు వంట చేయుటకు బ్రహ్మణ /వైశ్య వంట వారు కావలెను. భోజనం+వసతి కలదు ✆ 7997991919

■ బ్రాడీపేట, 4/9లోని సామ్‌సంగ్ సర్వీస్ సెంటర్ నందు పనిచేయుటకు CCO, స్టోర్ ఇన్‌ఛార్జ్ కావలెను. ఫ్రెషర్స్‌కు అవకాశం కలదు. ✆ 9700888839, 8396222993

■ గుంటూరులోని మా సంస్థ నందు పని చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. నో టార్గెట్స్, జీ:8000, వ:18-45సం॥ సంప్ర॥ ✆ 8500347916

■ గుంటూరు సిటీలోని కొత్తపేట మరియు అరండల్‌పేటలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు వెంటనే కావలెను. సంప్ర॥ 9866618811, 9866618877

■ మీకు వీడియో ఎడిటింగ్ మీద ఆసక్తి ఉందా! శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించబడును. అనుభవం గల వారికి ఉద్యోగం కలదు. స్త్రీలకు ప్రాధాన్యత ✆ 9912325693, 8465079567

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్న వారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓన్లీ ఆఫీస్ వర్క్. సంప్ర: 9963255441

■ లేడీ టెలికాలర్స్ కావలెను. అర్హత: Inter to Degree, జీతం: 7000/- to 12000/-, Time: 9:30am to 5:30pm. అడ్రస్: RTC బస్టాండ్ దగ్గర, గుంటూరు. 7671080354

■ గుంటూరు హోమ్ హెల్త్ కేర్ సర్వీసెస్. శ్రీమంతుల ఇళ్ళలో పేషెంట్స్‌ను చూసుకొనుటకు ఆడ మగ స్టాఫ్ కావలెను. జీ: 15000/- to 25,000/- ఫ్రీఫుడ్+రూమ్. 6309095202, 9392442511

■ Wanted Maths Teacher to Teach High School with at Least 3 Yrs. Exp. and also Primary Teachers. Cont: 7386859025

■ స్పాట్ జాబ్, అర్హతని బట్టి జీతం ఇవ్వబడును. మండలాల వారిగా ఏజెంట్లు కావలెను. Resume పంపగలరు. 8309295896(w), 8142038308

■ బార్ & రెస్టారెంట్‌లో పనిచేయుటకు అనుభవం కలిగిన క్యాషియర్స్, P/F వెయిటర్లు, కిచెన్ సూపర్‌వైజర్లు కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. సంప్ర॥ 9573271161, 8143198968

■ గుంటూరు అరండల్‌పేట 11/1 ఎయిర్‌టెల్ DTH ఆఫీసు నందు పనిచేయుటకు మహిళా అభ్యర్థులు కావలెను ✆ 9059596999

■ చీరాల BPCL పెట్రోల్ బంకు నందు పనిచేయుటకు 10మంది పంప్ బాయ్స్ కావలెను. మంచి జీతం ఇవ్వబడును. S.S. ఏజెన్సీ, చీరాల. ✆ 94419 01059

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421.

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 85736 33520, 90596 33520.

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు నర్సర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి+భోజనం. జీతం 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888

■ ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్ హైదరాబాద్ లో వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు, బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు కా॥. జీ: 16,000-25000/-రూం+బో॥ఫ్రీ. ఫోన్ 9390343785

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. ఫోన్ : 8891036931, 9246585901

ఈ పేపర్‌లో ప్రకటన కొరకు సంప్రదించండి
గుంటూరు
97030 13015
97034 67843
92904 02000

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి Smart Economic Display — Advertisement Feature

